ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్ -2 పోస్టుల
ప్రొవిజనల్ మెరిట్ లిస్ట్ విడుదల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్-2 పోస్టుల ప్రొవిజనల్ మెరిట్ లిస్ట్‌ను మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు గురువారం విడుదల చేసింది. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 1,284 పోస్టులను భర్తీ చేసేందుకు గతేడాది సెప్టెంబర్ 11న విడుదల చేయగా 24,045 మంది దరఖాస్తు చేసుకున్నారు. అదే ఏడాది నవంబర్ 10న నిర్వహించిన పరీక్షకు 23,323 మంది హాజరయ్యారు. నవంబర్ 12న ప్రిలిమినరీ కీని విడుదల చేసి, అభ్యంతరాలు పరిష్కరించి ఈ ఏడాది మార్చి 10న ఫైనల్ కీ, ఫలితాలు విడుదల చేసింది. దరఖాస్తుల పూర్తి వివరాలను ఆగస్టు 6న ప్రకటించింది. త్వరలోనే సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేపట్టనున్నది. వెయిటేజీకి సంబంధించి ఇది వరకే రెగ్యులర్ ఉద్యోగంలో ఉండి, అంతకు ముందు కాంట్రాక్ట్, అవుట్ సోర్స్ సర్వీసులకు వెయిటేజీ లబ్ధి పొందిన వారిని పరిగణనలోకి తీసుకోలేదని బోర్డు స్పష్టం చేసింది.

గిరిజన సంక్షేమ టీచర్లకు ఉద్యోగోన్నతులివ్వాలి

- టిఎస్‌యుటిఎఫ్ డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గిరిజన సంక్షేమశాఖ ఆధీనంలోని ఆశ్రమ పాఠశాలల్లో ఖాళీల భర్తీ కోసం అర్హులైన ఉపాధ్యాయులకు ఉద్యోగోన్నతులను కల్పించేందుకు షెడ్యూల్‌ను వెంటనే ప్రకటించాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టిఎస్‌యుటిఎఫ్) రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు చావ రవి, ప్రధాన కార్యదర్శి ఎ వెంకట్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ విషయంలో గత నెలలోనే సంఘం పక్షాన ప్రాతినిధ్యం చేసిన సందర్భంలో రెండు, మూడు రోజుల్లో ఉద్యోగోన్నతుల షెడ్యూల్ ఇస్తామంటూ అధికారులు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఒకవైపు పాఠశాలలు ప్రారంభమై రెండు నెలలుగా హైస్కూళ్లలో సబ్జెక్టు టీచర్లు లేక విద్యార్థులు నష్టపోతున్నారని తెలిపారు. మరోవైపు అర్హులైన ఉపాధ్యాయులు పదోన్నతుల్లేక రిటైర్డ్ అవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో గిరిజన సంక్షేమ శాఖాధికారులు వెంటనే ఉద్యోగోన్నతుల షెడ్యూల్ విడుదల చేసి విద్యార్థులకు, ఉపాధ్యాయులకు మేలు చేయాలని కోరారు. అలాగే పాఠశాల విద్యాశాఖలో చేపట్టినట్టు ఆశ్రమ పాఠశాలల్లోనూ భాషాపండితులు పిఇటిల పోస్టులను అప్‌గ్రేడ్ చేయాలని సూచించారు. అప్‌గ్రేడ్ పాఠశాలకు నూతన పోస్టులను మంజూరు చేయాలని తెలిపారు. ఆశ్రమ, ప్రాథమిక పాఠశాలకు కంటిజెంట్ వర్కర్లను నియమించాలని కోరారు. సిఆర్టీల పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో ప్రభుత్వం స్పందించని పక్షంలో గిరిజన సంక్షేమ కమిషనర్ కార్యాలయం ముందు టిఎస్‌యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

పోరాటాలపై నిర్బంధమే ప్రజాపాలనా?

- కాంగ్రెస్ ప్రభుత్వం పద్ధతి మార్చుకోవాలి : సిఐటియు

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న భాస్కర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'తమ సమస్యల పరిష్కారం కోసం కార్మికులు శాంతియుతంగా నిరసన తెలియజేయడం నేరమా? ఎన్నికల సమయంలో మీరిచ్చిన వాగ్దానాలను అమలు చేయాలంటే..అది శాంతిభద్రతల సమస్య అవుతుందా? మా నిరసన కార్యక్రమానికి అనుమతి ఇవ్వాలంటూ దరఖాస్తు చేసుకుంటే..లిఖిత పూర్వక పర్మిషన్ ఇవ్వకుండా ..మౌఖికంగా అనుమతిచ్చినట్టే ఇచ్చి, సిఐటియు నాయకులను, సంఘం నేతలను గృహ నిర్బంధంలో ఉంచటం, పర్మిషన్ ఉంది కదా అని జిల్లాల నుంచి తరలి వచ్చిన కార్మికులను ఎక్కడికక్కడ అరెస్టులు చేయటం ప్రజాపాలనలో భాగమా?' అంటూ సిఐటియు నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సిఐటియు రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, ఉపాధ్యక్షులు ఎస్‌వి రమ, కార్యదర్శి జె వెంకటేశ్, కోశాధికారి వంగూరు రాములు, రాష్ట్ర కమిటీ సభ్యులు ప్రసాద్, యాటల సోమన్న పాల్గొన్నారు.

భాస్కర్ మాట్లాడుతూ... ప్రజా ఉద్యమాలను, కార్మిక పోరాటాలను పోలీసు నిర్బంధం ద్వారా అణచాలని చూస్తే..ఊరుకునేది లేదని హెచ్చరించారు. ప్రజా ప్రభుత్వం అని చెప్పుకునే రేవంత్ సర్కార్ తన వైఖరిని మార్చుకోవాలని హితవు పలికారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం కూడా ఇదే పద్ధతిని కొనసాగించిందనీ, తద్వారా కార్మికుల, రైతుల, కూలీల, ఉద్యోగుల అసంతృప్తికి గురై అధికారం కోల్పోయిందని గుర్తు చేశారు. మధ్యాహ్న భోజన పథకం కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని అనేక సార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించటం వల్లే విద్యాశాఖ డైరెక్టరేట్ ముందు ధర్నా కార్యక్రమానికి ఆ సంఘం పిలుపునిచ్చిందని గుర్తు చేశారు. అయితే పోలీసులు ...కార్మికులను ఎక్కిడికక్కడ అరెస్టులు చేసి, నాయకులను గృహనిర్బంధంలో ఉంచటం ప్రజాపాలన లక్ష్యమా? అని ప్రశ్నించారు. దీంతో స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం ఏడో గ్యారెంటీగా ఉంటుందనే వాగ్దానం ఉత్తుత్తిదే అని తేలిపోయిందని విమర్శించారు.

ఎస్‌వి రమ మాట్లాడుతూ... మధ్యాహ్న భోజన కార్మికులవి గొంతెమ్మ కోర్కెలు కావన్నారు. ఐదు నెలలుగా పెండింగ్‌లో ఉన్న బిల్లులను విడుదల చేయాలని కోరుతున్నారని గుర్తు చేశారు. రూ. పదివేల వేతనాన్ని పెంచుతామని ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాన్ని అమలు చేయమని అడగటం నేరమెలా అవుతుంది? గృహ నిర్బంధాలు, అరెస్టులు చేస్తే..మీరిచ్చిన హామీలు పక్కకు పోతాయా? అని ప్రశ్నించారు. ఇప్పటికైనా వారికి రెగ్యులర్‌గా గ్రీన్ చానల్ ద్వారా జీతాలివ్వాలని డిమాండ్ చేశారు. జె వెంకటేశ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో పోలీసు రాజ్యం సాగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వంగూరు రాములు మాట్లాడుతూ... గత ప్రభుత్వం తోవలోనే ప్రస్తుత ప్రభుత్వం నడుస్తున్నదని విమర్శించారు. కార్మికుల సమస్యలు పరిష్కరించమంటే..పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. నిర్బంధ విధానాన్ని విడనాడాలని సూచించారు.

కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిపై ఎఐసిసి సీరియస్

- క్రమశిక్షణ సంఘం చైర్మన్ మల్లు రవి ఫోన్
- రెండు, మూడురోజుల్లో పిలిచి మాట్లాడే అవకాశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఎఐసిసి సీరియస్ అయింది. అధిష్టానం ఆదేశాలతో టిపిసిసి క్రమశిక్షణ సంఘం చైర్మన్ మల్లు రవి రంగంలోకి దిగారు. రాజగోపాల్‌రెడ్డికి ఫోన్ చేసి మాట్లాడినట్టు తెలిసింది. రెండు, మూడు రోజుల్లో ఆయన్ను గాంధీభవన్‌కు పిలిచి మాట్లాడాలని క్రమశిక్షణ సంఘం నిర్ణయించింది. గతంలోనూ ఆయన ఇలాంటి వ్యాఖ్యలు చేసినప్పటికీ పార్టీ పెద్దగా పట్టించుకోలేదు. అయినా ఆయన వైఖరి మాత్రం మార్చుకోకుండా సొంతపార్టీ నేతలపై, సిఎంపై బహిరంగ వ్యాఖ్యలు చేస్తున్నారు. తనకు ఇష్టమెచ్చినట్టు సిఎం, అధిష్టానంపై కూడా విమర్శలు చేసిన సంఘటనలూ ఉన్నాయి. ఈ క్రమంలో పార్టీ ఆయనపై ఇప్పుడు సీరియస్‌గా తీసుకుంది. 'తనకు మంత్రి ఎందుకు ఇవ్వడం లేదు. తన కంటే జూనియర్లకు ఇచ్చారు' వ్యాఖ్యానించారు. సిఎం రేవంత్‌రెడ్డి మూడున్నరేళ్లు మాత్రమే పదవిలో ఉంటారని, ఆ తర్వాత ముఖ్యమంత్రి ఎవరు అవుతారో అధిష్టానం చూసుకుంటుందంటూ పరోక్షంగా సీఎంపై విమర్శల బాణం ఎక్కుపెట్టారు. గతంలో టిపిసిసి అధ్యక్షులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డిపై కూడా ఇలాంటి వ్యాఖ్యలే చేశారు. కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఏదో విధంగా మాట్లాడి పతాక శీర్షికల్లో ఉంటారు. చాలా సార్లు సొంత పార్టీ నేతలపై విమర్శలు చేసి పార్టీ ఆగ్రహానికి గురయ్యారు. తాజాగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై విమర్శలు చేసి మరోసారి వార్తల్లో నిలిచారు. దీంతో పార్టీల్లో ఆయన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. కాంగ్రెస్ పార్టీ ఒకవైపు బీసీ బిల్లుపై ఢిల్లీలో కాంగ్రెస్ పోరాటం కొనసాగించడం, మరోవైపు కాళేశ్వరం అవినీతిపై పిసి ఘోష్ నివేదిక రాష్ట్ర ప్రభుత్వానికి అందజేయడం...వీటిని కాంగ్రెస్ పార్టీ తమకు అనుకూలంగా మాల్చుకుంటున్న క్రమంలో సిఎంపై రాజగోపాల్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు పార్టీలో గందరగోళానికి దారి తీస్తున్నాయి. ఆయన వ్యాఖ్యల వల్ల ప్రభుత్వానికి, పార్టీకి నష్టం కలుగుతున్నాయని అధిష్టానం భావిస్తోంది. రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యలను ఎఐసిసి కార్యదర్శి సంపత్‌కుమార్ ట్వీటర్ వేదికగా తప్పుపట్టారు. ఆయనకు మంత్రి పదవి ఇచ్చే విషయాన్ని అధిష్టానం నిర్ణయిస్తుందని పేర్కొన్నారు. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి టిపిసిసి అధ్యక్షులుగా ఉన్న సమయంలో కూడా ఆయనపై రాజగోపాల్‌రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. దీంతో ఇద్దరి మధ్య తీవ్రస్థాయిలో విభేదాలొచ్చాయి. పార్టీలో కొనసాగలేక ఆయన కాంగ్రెస్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశారు. తర్వాత కమలం కండువా కప్పుకున్నారు. మునుగోడు ఉపఎన్నికల్లో బిజెపి తరపున పోటీ చేసి ఘోర పరాజయం పాలయ్యారు. ఓటమి తర్వాత కొంతకాలం ఆయన రాజకీయంగా సైలెంట్‌గా ఉన్నారు. బిజెపిలో ఆశించిన స్థాయిలో అవకాశాలు లేవని భావించిన ఆయన మళ్లీ కాంగ్రెస్‌లోకి వచ్చారు. హస్తం గుర్తుపై పోటీ చేసి తిరిగి మునుగోడు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఈ సందర్భంగా భువనగిరి పార్లమెంటు నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని ఎంపిగా గెలిపిస్తే...మంత్రి పదవి ఇస్తామంటూ సిఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చినట్టు రాజగోపాల్‌రెడ్డి అంటున్నారు. ప్రభుత్వం ఏర్పడి 20 నెలలు గడిచినప్పటికీ మంత్రివర్గ విస్తరణలో ఆయనకు చోటు దక్కలేదు. దీంతో ఆయన వరుసగా మీడియా ముందుకు వచ్చి కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ... రేవంత్‌ను టార్గెట్ చేస్తూ వ్యాఖ్యలు చేస్తున్నారని పార్టీ నేతల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి.

వికలాంగుల పింఛను రూ. 3 వేలకు పెంచాలి

- కేంద్ర మంత్రికి అడ్లూరి లక్ష్మణ్ వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వికలాంగుల పింఛను కేంద్రం వాటాగా రూ. మూడు వేలకు పెంచాలని కేంద్ర మంత్రి వీరేందర్‌కుమార్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య గురువారం ఢిల్లీని కేంద్ర మంత్రికి వినతి పత్రాన్ని అందజేశారు. వికలాంగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మానవతా దృక్పథంతో వాటిని పరిష్కరించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం 2014నుంచి ఒక్క రూపాయి కూడా వికలాంగులకు పింఛన్ పెంచలేదని గుర్తు చేశారు. ప్రస్తుతం ఇస్తున్న రూ. 300 ఏ మాత్రం సరిపోవని తెలిపారు. నిత్యావసర సరుకుల ధరలు ఐదు వందల రేట్లు పెరిగాయని పేర్కొన్నారు.

స్థానిక జ్ఞానాన్ని పునాదిగా గుర్తించాలి

- తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

స్థానిక జ్ఞానాన్ని అనుబంధంగా కాకుండా పునాదిగా గుర్తించాలని, వలసవాదపు దృష్టికోణాలకు అతీతంగా విద్యా వ్యవస్థలు ముందుకు సాగాల్సిన అవసరం ఉందని తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. హైదరాబాద్‌లోని ఇంగ్లీష్ అండ్ విదేశీ భాషల విశ్వవిద్యాలయం (ఇఫ్లూ)లో "స్వదేశీ, గిరిజన సంఘాలు-పరిశోధన పద్ధతులను పునర్నిర్మించడం" అనే అంశంపై మూడు రోజుల అంతర్జాతీయ సదస్సు గురువారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. స్వదేశీ జ్ఞాన వ్యవస్థలను అన్వేషించడానికి, పరిశోధనకు సంప్రదాయ విద్యావిధానాలపై పునరాలోచించడానికి పండితులు, పరిశోధకులు, సమాజ నాయకులను ఈ సదస్సు ఒకచోటకు చేర్చిందని తెలిపారు. స్థానిక సంస్కృతులను పాశ్చాత్య విద్యా ప్రమాణాల ద్వారా అంచనా వేయకూడదని చెప్పారు. విధాన చర్చలో గిరిజన జ్ఞానం, సంప్రదాయాలు, పర్యావరణ జ్ఞానాన్ని ప్రధాన స్రవంతిలోకి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు.ఇఫ్లూ విసి ప్రొ.ఎన్ నాగరాజు మాట్లాడుతూ.. స్వదేశీ ప్రపంచ దృక్పథాల విద్యా ప్రాముఖ్యతను, విస్తృత పరిశోధన, పర్యావరణ వ్యవస్థలో వాటికి స్థలాన్ని సృష్టించాల్సిన అవసరాన్ని చెప్పారు. భారతీయ, ప్రపంచ సాహిత్య విభాగంలో అధ్యాపక సభ్యులు డాక్టర్ కె.లావణ్య ప్రారంభ కార్యక్రమాన్ని ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో సమ్మక్క సారక్క సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ విసి ప్రొఫెసర్ వైఎల్ శ్రీనివాస్, ప్రొ. దీపక్ కుమార్ బెహెరా, కీనోట్ స్పీకర్ ప్రొ.అమరేశ్వర్ గల్లా, రిజిస్ట్రార్ ఐ/సి ప్రొ. హరిప్రసాద్, ప్రొక్టర్ ప్రొ. శ్యామ్‌రావు రాథోడ్, డీన్-స్కూల్ ఆఫ్ లిటరరీ స్టడీస్ ప్రొ.సోన్బా ఎం సాల్వే, కాన్ఫరెన్స్ కన్వీనర్ డాక్టర్ రాజునాయక్ విశ్వవిద్యాలయ అధ్యాపకులు, పరిశోధనా పండితులు, బోధనేతర ఉద్యోగులు పాల్గొన్నారు.

సినీకార్మికుల సమ్మెకు సిపిఎం సంపూర్ణ మద్దతు

- సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి : జాన్‌వెస్లీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సమస్యల పరిష్కారం కోసం ఈ నెల నాలుగో తేదీ నుంచి తెలుగు చలనచిత్ర కార్మికులు చేస్తున్న సమ్మెకు సిపిఎం రాష్ట్ర కమిటీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. 24 క్రాఫ్ట్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్‌లో పనిచేస్తున్న వేలాది కార్మికులకు సంబంధించిన వేతనాల పెంపు విషయంలో చలనచిత్ర రంగంలోని నిర్మాతలు మొండి పట్టుదలకు పోకుండా వారితో చర్చలు జరపాలని కోరారు. వారి సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించారు. పెరుగుతున్న ధరలకనుగుణంగా ఎప్పటికప్పుడు వేతనాలను పెంచాలంటూ కార్మికులు కోరుతున్నారని తెలిపారు. 2022లో ఒప్పందం కుదిరిందని పేర్కొన్నారు. గత మూడేండ్ల నుంచి వేతనాలను పెంచలేదని ఆందోళన వ్యక్తం చేశారు. పైగా గతంలోనే వేతన ఒప్పందం సందర్భంగా 30 శాతం పెంపుదలకు హామీనిచ్చారని గుర్తు చేశారు. ఇచ్చిన హామీని వెంటనే నెరవేర్చాలని కార్మికులు డిమాండ్ చేస్తూ ఆందోళనలు చేస్తున్నారని తెలిపారు. అసంఘటిత రంగంగా ఉన్న కార్మికులు ఏరోజు కారోజు పని దొరికితే గానీ కుటుంబాలు గడవని వారే ఎక్కువగా ఉన్నారని పేర్కొన్నారు. భారీ బడ్జెట్ ఉన్న సినిమాలు రూ.వందల కోట్ల మార్కెట్ చేస్తున్న సందర్భంలో కార్మికుల వేతనాల కోసం భేషజాలకు పోకుండా నిర్మాతలు పరిష్కారం కోసం పూనుకోవాలని సూచించారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం జోక్యం చేసుకుని కార్మికులకు న్యాయం జరిగే విధంగా పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు.ఫిల్మ్ ఛాంబర్, నిర్మాతల మండలి కార్మికులతో చర్చలు జరిపి పరిష్కరించాలని కోరారు.

జిఎస్‌టిఎటి జ్యుడీషియల్ సభ్యుడిగా వేమిరెడ్డి భాస్కర్ రెడ్డి

హైదరాబాద్ : గూడ్స్ అండ్ సర్వీసెస్ ట్యాక్స్ అప్పిలేట్ ట్రిబ్యునల్ (జిఎస్‌టిఎటి) జ్యుడీషియల్ సభ్యుడిగా తెలంగాణ హైకోర్టు సీనియర్ న్యాయవాది వేమిరెడ్డి భాస్కర్ రెడ్డిని కేంద్ర ప్రభుత్వం నియమించింది. మొత్తం 53 మంది సభ్యుల్లో ఆయన ఒక్కరు. ఇది జిఎస్‌టి విధానంలో వివాదాల పరిష్కార వ్యవస్థను బలోపేతం చేయడానికి ఏర్పాటు చేయబడింది.

పారదర్శకమైన మూల్యాంకన వ్యవస్థను రూపొందిస్తున్నాం

- పలు రాష్ట్ర ప్రభుత్వాలతో ఎంఒయూ కుదుర్చుకున్నాం
- ఎన్‌ఐఆర్‌డిపిఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ జి నరేంద్ర కుమార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పలు రాష్ట్రాల ప్రతినిధులతో చర్చిస్తున్న నరేంద్ర కుమార్

గ్రామీణాభివృద్ధి ప్రాజెక్టుల మూల్యాంకనాన్ని బలపరిచే వ్యవస్థను రూపొందిస్తున్నామని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్, పంచాయతీరాజ్ శాఖ డైరెక్టర్ జనరల్ డాక్టర్ జి నరేంద్ర కుమార్ తెలిపారు. గురువారం రాజేంద్రనగర్‌లోని ఎన్‌ఐఆర్‌డిపిఆర్‌కు సంబంధించిన అధికారులు పలు రాష్ట్రాల ప్రతినిధులతో భేటీ అయ్యారు. దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన కింద గ్రామీణాభివృద్ధి కార్యక్రమాల ప్రాజెక్టు మూల్యాంకన వ్యవస్థను పొందుపరిచేందుకు ఎంఒయు కుదుర్చుకున్నారు. ఒప్పందం కుదుర్చుకున్న రాష్ట్రాల్లో అరుణాచల్ ప్రదేశ్, త్రిపుర, జమ్మూ కాశ్మీర్, తమిళనాడు, కర్ణాటక, నాగాలాండ్, అస్సాం, ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్, ఆంధ్రప్రదేశ్ ఉన్నాయి. ఈ కార్యక్రమంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ ప్రతినిధులు కూడా పాలుపంచుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ నరేంద్ర కుమార్ మాట్లాడుతూ.. "ఈ అవగాహన ఒప్పందాల ద్వారా ప్రాజెక్ట్ మూల్యాంకన ప్రక్రియ మరింత సులభతరం అవుతుంది. పాల్గొన్న రాష్ట్రాల్లో గ్రామీణ నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు సమర్థవంతంగా అమలవుతాయి" అని తెలిపారు. నైపుణ్యాభివృద్ధి ప్రాజెక్టులకు గుణాత్మక, పారదర్శక మూల్యాంకన వ్యవస్థను ఏర్పర్చడం అసరమని నొక్కి చెప్పారు. డిడియుజికెవై 2.0కు ఎన్‌ఐఆర్‌డిపిఆర్ జాతీయ స్థాయి ప్రాజెక్టు అప్రైజల్ ఏజెన్సీగా పనిచేస్తుందని తెలిపారు. ప్రాజెక్టు అప్రైజల్, ఎన్‌ఐఆర్‌డిపిఆర్ డైరెక్టర్ సతీశ్‌కుమార్, ఎంఒఆర్‌డి అండర్ సెక్రటరీ (నైపుణ్యాలు) మేరీ థామస్, ఎంఒఆర్‌డి మిషన్ మేనేజర్ శశి కుమార్ యాదవ్, పాల్గొన్నారు.

చేనేతన్న సంక్షేమంలో తెలంగాణ నెంబర్ వన్

- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

చేనేత కార్మికుల సంక్షేమంలో, అభివృద్ధిలో తెలంగాణ రాష్ట్రం మొదటి స్థానంలో ఉందని రాష్ట్ర వ్యవసాయ, జౌళిశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. గురువారం చేనేత దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ నెక్లెస్ రోడ్డులోని పిపుల్స్ ప్లాజాలో ఏర్పాటు చేసిన చేనేత వస్త్ర ఎగ్జిబిషన్‌ను ఆయన ప్రారంభించారు. ఆగస్టు 17 వరకు ఎగ్జిబిషన్, అమ్మకాలుంటాయని తెలిపారు. కొండా లక్ష్మణ్ బాపూజీ అవార్డులకు ఎన్నికైన వారిని మంత్రి సత్కరించారు. ఎగ్జిబిషన్‌లో భాగంగా ఎలక్ట్రానిక్ మడత ఆసు మిషనును ఆయన పరిశీలించారు. తెలంగాణ అథెంటిక్ వీవ్స్ లోగోను, త్రిలింగ పట్టు చీరలను మంత్రి తుమ్మల ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జియో ట్యాగింగ్‌లోనూ మన రాష్ట్రం ముందున్నదని చెప్పారు. చేనేత కేవలం ఉపాధికి మార్గం మాత్రమే కాదనీ, భారతీయ సంస్కృతికి ప్రతీక అని అభివర్ణించారు. ఈ వారసత్వ హస్తకళను పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని గుర్తుచేశారు. చేనేత రంగంలో తెలంగాణ దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపును సంపాదించిందనీ, గద్వాల, నారాయణపేట, పోచంపల్లి ఇక్కత్, సిద్దిపేట గొల్లభామ, వరంగల్ దర్రిస్, కరీంనగర్ బెడ్‌షీట్లు వంటి ఉత్పత్తులు అంతర్జాతీయంగా పేరుగాంచాయని చెప్పారు. చేనేత ఉత్పత్తుల వినియోగాన్ని పెంచేందుకు ప్రభుత్వ శాఖలు టెస్కో ద్వారానే వస్త్రాలను కొనుగోలు చేయాలనే ఆదేశాలు ఇచ్చినట్టు వెల్లడించారు. ఐఐహెచ్‌టీ (ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ) ద్వారా యువతకు నైపుణ్య శిక్షణ అందిస్తూ చేనేత కళను కొత్త తరం వరకు తీసుకెళ్లే ప్రయత్నిస్తున్నట్టు తెలిపారు. చేనేత కార్మికులకు ఏ సమస్య వచ్చిన ప్రభుత్వం అండగా ఉంటుందని ఈ సందర్భంగా మంత్రి హామీ ఇచ్చారు.జౌళి శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్ మాట్లాడుతూ చేనేత కళలన్నింటికి పునర్వైభవం తెచ్చేలా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. రెండు సంవత్సరాల కాలవ్యవధితో నేతన్న పొదుపు కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని అన్నారు. మరణించిన చేనేత కుటుంబానికి అండగా ఉండేలా నేతన్నకు భద్రత పథకం ద్వారా మరణించిన కుటుంబ నామినీకి రూ.ఐదు లక్షలు అందజేస్తున్నామన్నారు. చేనేత రుణమాఫీ కోసం రూ.33 కోట్లు విడుదల చేసినట్టు తెలిపారు. చేనేత కార్మికులకు సంవత్సరానికి రూ.18 వేలు, అనుబంధ కార్మికులకు రూ. ఆరు వేలు వచ్చేలా నేతన్న భరోసా పథకాన్ని ప్రారంభించినట్టు వివరించారు. కొండా లక్ష్మణ్ బాపూజీ ఐఐహెచ్‌టీని ప్రారంభించి, 120 మంది విద్యార్థులకు అడ్మిషన్లు ఇచ్చినట్టు తెలిపారు.

IN THE COURT OF THE HON'BLE II SENIOR CIVIL JUDGE, CITY CIVIL COURT:: AT: HYDERABAD.
O.S.No. 556 OF 2022
BETWEEN:-
SRI N.SRI RAMA CHANDRA MURTHY ...PLAINTIFF
AND
N.SATYANARAYANA MURTHY and others ...DEFENDANTS
To
1.SMT.CHANDRAKALA W/o..not known, Aged about 42 Years, Occ:Teacher, R/o. H.No:2-2-1105/29, Plot No:12/B, Tilak Nagar, Hyderabad-500 044.TS. (Defendant No.4).
2. SRI K. RAJA RAO, S/o. Late.K. BHASKER SHARMA MURTHY, Aged about 40 Years, Occ:Private Service, R/o. H.No:1-8-739/1, Brundavan Colony, Old Nallakunta, Hyderabad-500 044.TS. (Defendant No.5).
3. SMT. VENNELA W/o. not known Aged about 34 Years, Occ:House wife, R/o. H.No:1-8-739/1, Brundavan Colony, Old Nallakunta, Hyderabad-500 044.TS. (Defendant No.6)
4. K.VAMSEE KRISHNA S/o.Late. K.ASHOK, Aged about 32 Years, Occ:Private Service R/o. H.No:1-8-739/1, Brundavan Colony, Old Nallakunta, Hyderabad-500 044.TS. (Defendant No.7).
5. N. RADHA KRISHNA MURTHY, S/o. N.Srinivas and Late. K.Surya Kumari D/o. K.Janaki, Aged about 12 Years, Occ:Student, Being a minor rep by his Guardian and next friend, N.Satyanarayana Murthy S\o. NRK Murthy, R/o. H.No:1-8-739/1, Brundavan Colony, Old Nallakunta, Hyderabad-500 044.TS. (Defendant No:9).
NOTICE
PLEASE TAKE NOTICE that the above said Plaintiff has filed the suit for Partition and Separate Possession against you all i.e. Defendant No.4 to 7 & 9 and this Hon'ble court has order for service of notice to you all i.e. Defendants No.4 to 7 & 9 herein. The above case is posted for your appearance on 28-08-2025 at 10-30 AM either in person or through an Advocate, failing which the matter will be decided exparte.
// BY ORDER OF THE COURT //
BOLLAM KRUPANANDAM
ADVOCATE,
HIGH COURT OF TELANGANA
H.No:9-1-364/6/03,
Langar House, Hyde 00008
Cell No:9603720083

రైల్వే ప్రాజెక్టులపై సంజయ్ కుమార్ శ్రీవాస్తవతో సిఎస్ చర్చ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో రైల్వే ప్రాజెక్టులు, అభివృద్ధి దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణారావు చర్చించారు.గురువారం హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో సిఎస్‌ను సంజయ్ కుమార్ శ్రీవాస్తవ కలిశారు. అనంతరం వారిద్దరు రాష్ట్రంలో రైల్వే అభివృద్ధికి సంబంధించి చేపట్టిన పనుల పురోగతిని విశ్లేషించారు.

ప్రాజెక్ట్ పనుల పురోగతికి టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు

- అటవీ అనుమతులపై తక్షణం స్పందించాలి
- రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో మంచి రోడ్లు ఉండాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి సూచనల మేరకు ప్రాజెక్ట్స్ పనులు వేగంగా పూర్తిచేసేందుకు టాస్క్‌ఫోర్స్ కమిటీ ఏర్పాటు చేసినట్టు రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. సరైన ప్రణాళికలతో వెళ్లేందుకు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయి పనుల పురోగతినీ పర్యవేక్షణకే ఈ టాస్క్ ఫోర్స్ కమిటీ పనిచేస్తుందని మంత్రి పేర్కొన్నారు. రోడ్ల అభివృద్ధి సంస్థ చైర్మన్, ఆర్ అండ్ బీ స్పెషల్ సిఎస్, సిసిఎల్‌ఎ కమిషనర్, విద్యుత్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, ఇరిగేషన్, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మైన్స్, జియాలజీ, పిసిసిఎఫ్ ఈ టాస్క్ ఫోర్స్ కమిటీ పనిచేయనుంది. విద్యుత్ లైన్ల షిఫ్టింగ్, వాటర్ యుటిలిటీ క్లియరెన్స్, ఫారెస్ట్ క్లియరెన్స్ సంబంధిత అంశాలపై గురువారం డా బిఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో సుదీర్ఘంగా మూడు గంటల పాటు మంత్రి అధ్యక్షతన టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి పలు అంశాలపై అధికారులతో చర్చించారు. ఇరిగేషన్ శాఖకు సంబంధించి వరంగల్ - ఖమ్మం సెక్షన్‌లో ఎన్‌హెచ్ 163 జీ ఎపరిధిలోని ప్యాకేజీ 2లో చెరువుల అంశాన్ని మంత్రికి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ రూపంలో ఎన్‌హెచ్ అధికారులు వివరించారు. మహబూబాబాద్, నెల్లికుదురు ప్రాంతంలో చెరువుల సమస్యలతోపాటు హై లెవల్ బ్రిడ్జిని ప్రతిపాదించారు. నీటిపారుదల నుంచి ఎన్‌వోసీ రావాల్సి ఉందని అన్నారు. ఎన్‌హెచ్ 30 సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు రోడ్డుతోపాటు గ్రీన్‌ఫీల్డ్ హైవే రోడ్డుకు సంబంధించి పలు సమస్యలు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. సంబంధిత శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో మాట్లాడి ఇరిగేషన్ శాఖ ఇబ్బందులు ఏమైనా ఉంటే ప్రత్యేక చొరవ తీసుకుని మాట్లాడి పరిష్కరిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. అటవీ అనుమతులకు సంబంధించిన అంశాలు ప్రధానంగా మంత్రి దృష్టికి తెచ్చారు. ఎన్‌హెచ్ ప్రాజెక్టులు 2 ఉంటే అందులో 6 ప్రాజెక్టులు ఫారెస్ట్ క్లియరెన్స్‌లేక పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. కల్వకుర్తి - శ్రీశైలం 62 కిలోమీటర్ల ఎలివేటెడ్ కారిడార్‌కు కేంద్ర మంత్రి గడ్కరీ సానుకూలంగా ఉన్నారనీ, ఫారెస్ట్ అధికారులు అందుకు తగ్గట్టుగా సమన్వయంతో పనిచేస్తే గొప్ప ప్రాజెక్ట్ పూర్తి చేసినట్టవుతుందన్నారు. ఎలక్ట్రికల్‌కు సంబంధించి 220కెవి, 400కెవి లైన్ సమస్యలతోపాటు, 33కెవి, 11కెవి లైన్ షిఫ్టింగ్ సమస్యలున్నాయని అధికారులు మంత్రికి వివరించారు. ఏయే ప్రాంతంలో ఏ సమస్య ఉందో వివరాలు ఇవ్వాలని, వాటిని పరిష్కరించేందుకు విద్యుత్ శాఖ అధికారి ముషారఫ్ ఆలీకి బాధ్యతలు అప్పగించారు. మైనింగ్ శాఖ నుంచి కొన్ని అనుమతులు రావాల్సి ఉందన్నారు. ప్రధానంగా భూసేకరణలో భాగంగా రెవెన్యూకు సంబంధించిన అంశాలే ఎక్కువ ఉన్నాయని చెప్పారు. ఈనెల 18న మరోమారు భేటీ అవుదామన్నారు. ఆయా జిల్లా కలెక్టర్లు హాజరయ్యేలా చూడాలని మంత్రి చెప్పారు. తర్వాత మీటింగ్‌కు ఇప్పుడు వచ్చిన అంశాలపై క్లారిటీ వచ్చేలా సంబంధిత కలెక్టర్లు, ఆర్‌డిఓలను తను కో ఆర్డినేట్ చేస్తానని స్పెషల్ తెలిపారు.రీజినల్ రింగ్ రోడ్డు తెలంగాణకు మణిహారమనీ, రెండు మూడు నెలల్లో పనులు ప్రారంభించాలానే చిత్తశుద్ధితో ఉన్నామని మంత్రి స్పష్టం చేశారు. ఉత్తర భాగం భూసేకరణ దాదాపు పూర్తి అయిందన్నారు. ఆరు లేన్లుగా అప్‌గ్రేడ్ చేయడం వల్ల పనులు ఆలస్యమయ్యాయని అన్నారు. సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట, భువనగిరి జిల్లాల్లో అక్కడక్కడ ఉన్న చిన్న సమస్యలు పరిష్కరించాలని అన్నారు. భూ పరిహారం చెల్లింపు ప్రక్రియ వెంటనే ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రాజెక్టుల క్లియరెన్స్ కోసం త్వరలో ప్రధాని మోడీని కలుస్తామని మంత్రి ఈ సందర్భంగా వెల్లడించారు.

EYANTRA VENTURES LIMITED
CIN: L72100TG1984PLC167149
Regd. Office: 301, 3rd Floor, CSR Estate, Plot No. 8, Sector - 1, HUDA Techno Enclave, Madhapur Main Road, Hyderabad -500081, Telangana, India. Ph. No: +91-7702974403, Email ID: support@eyantraventures.com

30 జూన్, 2025తో ముగిసిన త్రైమాసికం కొరకు ఇయంత్ర వెంచర్స్ లిమిటెడ్ (కంపెనీ) యొక్క స్టాండ్‌అలోన్ మరియు కన్సాలిడేటెడ్ ఆడిట్‌చేయని యొక్క ఆర్థిక ఫలితాల సారాంశం

30 జూన్, 2025తో ముగిసిన త్రైమాసికం కొరకు స్టాండ్‌అలోన్ మరియు కన్సాలిడేటెడ్ ఆడిట్‌చేయని ఆర్థిక ఫలితాలకు సంబంధించి 07 ఆగష్టు, 2025న నిర్వహించిన వారి సమావేశంలో కంపెనీ యొక్క బోర్డు ఆఫ్ డైరెక్టర్లు ఆమోదించారు. కంపెనీ యొక్క చట్టబద్ధమైన ఆడిటర్లచే జారీచేసిన పరిమిత సమీక్ష రిపోర్ట్‌లతో పాటుగా పై పేర్కొన్న ఆర్థిక ఫలితాలు కంపెనీ యొక్క వెబ్‌సైట్: https://www.eyantraventures.com/resultannouncement/ లో అందుబాటులో కలవు మరియు వాటిని దిగువ ఇచ్చిన క్విక్ రెస్పాన్స్ (క్యూఆర్) కోడ్ స్కాన్‌చేయడం ద్వారా పొందవచ్చును.

బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల తరపున
ఇయంత్ర వెంచర్స్ లిమిటెడ్ తరపున
సం/-
వినీతా రాజ్ నారాయణం
చైర్‌పర్సన్ & మేనేజింగ్ డైరెక్టర్
DIN: 09319780
ప్రదేశం: హైదరాబాద్
తేదీ: 07-08-2025

ఒబెన్ ఎలక్ట్రిక్ నుంచి 'రోర్ ఈజెడ్ సిగ్మా' బైకు

బెంగళూరు : విద్యుత్ ద్విచక్ర వాహనాల కంపెనీ ఒబెన్ ఎలక్ట్రిక్ సంస్థ మోటార్ సైకిల్ విభాగంలో 'రోర్ ఈజెడ్ సిగ్మా' పేరుతో కొత్త మోడల్‌ను విడుదల చేసింది. ఒకసారి పూర్తి చార్జింగ్‌తో 175 కిమీ వరకు ప్రయాణించవచ్చు. దీన్ని రెండు వేరియంట్లలో అందుబాటులోకి తెచ్చినట్లు పేర్కొంది. 3.4 కెడబ్ల్యూహెచ్ బ్యాటరీ సామర్థ్యం ఉన్న వేరియంట్ ధర రూ.1.27 లక్షలు, 4.4 కెడబ్ల్యూహెచ్ సామర్థ్యం ఉన్న వేరియంట్ ధర రూ.1.37 లక్షలుగా నిర్ణయించింది. రూ.2,999 టోకెన్ అమౌంట్‌ను చెల్లించి బుక్ చేసుకోవచ్చని తెలిపింది. రెండు వేరియంట్‌ల టాప్ స్పీడ్ 95 కిలోమీటర్లుగా ఉందని పేర్కొంది.

మైనర్ బాలుడి నిర్బంధంపై హెచ్‌ఆర్‌సి ఆగ్రహం

- హైదరాబాద్ సిపికి నోటీసులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మైనర్ బాలుని అక్రమ నిర్బంధం, థర్డ్ డిగ్రీ ప్రయోగం కేసులో హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్‌పై తెలంగాణ మానవహక్కుల కమిషన్ చైర్మన్ జస్టిస్ షమీమ్ అక్తర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తన 17 ఏళ్ల మైనర్ కుమారుడు దగ్గుపాటి అజ్జి కుమార్ శర్మను 2024 డిసెంబర్ 15 నుంచి 2024 డిసెంబర్ 17 వరకు జూబ్లీ హిల్స్ పోలీసులు అక్రమంగా నిర్బంధించి, హింసించారని హైదరాబాద్‌కు చెందిన దగ్గుబాటి రాంబాబు కమిషన్‌లో ఫిర్యాదు చేశారు. దాంతో కమిషన్ జూబ్లీహిల్స్ పోలీసులపై (హెచ్‌ఆర్‌సి 2901/2025) కేసు నమోదు చేసింది. ఫిర్యాదుదారుడు చేసిన ఆరోపణలను తీవ్రంగా పరిగణించిన కమిషన్ పోలీసుల హింస కారణంగా బాధితుడు నడవలేని స్థితిలో ఉన్నట్టు పేర్కొంది. సిటీ పోలీస్ కమిషనర్ ఈ నెల 12న వ్యక్తిగతంగా హాజరై కేసుకు సంబంధించి అన్ని రికార్డులు సమర్పించాలని ఆదేశించింది. హైదరాబాద్‌లోని నిమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ బాధితుడిని పరిశీలించి అవసరమైన చికిత్స అందించడంతో పాటు 48 గంటల్లోపు వివరణాత్మక నివేదికను సమర్పించాలని ఆదేశించారు.

గోదావరి బనకచర్ల ప్రాజెక్ట్‌ను ఉపసంహరించుకోండి

- దానివల్ల ఎపికి ఆర్థికంగా నష్టం
- చంద్రబాబుకు మర్రి శశిధర్‌రెడ్డి సూచన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గోదావరి - బనకచర్ల ప్రాజెక్ట్‌ను ఉపసంహరించుకోవాలని మర్రి చెన్నారెడ్డి మెమోరియల్ ట్రస్ట్ కార్యదర్శి మర్రి శశిధర్‌రెడ్డి ఎపి ప్రభుత్వానికి సూచించారు. గురువారం హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ బనక చర్ల నిర్మాణానికి రూ.81 వేల కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేశారని అన్నారు. తెలంగాణతో పాటు పలు రాష్ట్రాలు వ్యతిరేకించడం, కేంద్రం నుంచి అనుమతులు రాకపోవడం తదితర కారణాల వల్ల ప్రాజెక్ట్ ఆలస్యం అవడంతో అంచనా వ్యయం భారీగా పెరుగుతుందని చెప్పారు. ఎపికి చెందిన విద్యావేత్తలు, మేధావులు సైతం దీన్ని వ్యతిరేకిస్తున్నారని గుర్తు చేశారు. నిపుణుల అంచనాల ప్రకారం ఈ ప్రాజెక్ట్ పూర్తయ్యే వరకు రూ.ఐదు లక్షల కోట్లకు చేరుతుందని పేర్కొన్నారు. రాయలసీమలోని 30 లక్షల ఎకరాలకు సాగు నీరందించే కార్యక్రమాన్ని తాము వ్యతిరేకించడం లేదని, అయితే ఆ ప్రాజెక్ట్ వల్ల లాభం కన్నా నష్టమే ఎక్కువగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. ఉమ్మడి ఎపిలో చంద్రబాబు సిఎంగా ఉన్నప్పుడు ప్రవేశపెట్టిన నీరు మీరు కార్యక్రమం ఎంతో సత్ఫలితాలు ఇచ్చిందని గుర్తు చేశారు. ప్రముఖ నీటి పారుదల రంగ నిపుణులు హన్మంతరావు ప్రతిపాదించిన ఫోర్ వాటర్ కాన్సెప్ట్‌ను అమలు చేయాలని సూచించారు. రాజస్థాన్ ఈ పథకం ద్వారా ఎడారిలో పచ్చని ప్రకృతిని సృష్టించిందని అన్నారు. కరువులో సైతం మూడు పంటలు పండుతాయని పేర్కొన్నారు. ఎపి సిఎం చంద్రబాబు ఆ దిశగా ఆలోచించాలని సూచించారు.

ఇందిరమ్మకు పైసల కష్టాలు

- దబ్బుల్లేక ఇళ్లు కట్టలేని పేదలు
- లబ్ధిదారులకందని డ్వాక్రా సంఘాల రుణాలు
- ఎస్‌హెచ్‌జి సంఘాల్లో సభ్యులుకాని కొందరు లబ్ధిదారులు
- ఆగస్టులో ప్రారంభించకపోతే రద్దు చేస్తామంటూ హెచ్చరిక

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'ఇందిరమ్మ' పథకం కింద ఇళ్లు కట్టుకునేందుకు లబ్దిదారులు డబ్బుల్లేక సతమతమవుతున్నారు. అర్హులైనా పునాదులు తీసేందుకే డబ్బులు లేక ఎంతోమంది వదులుకుంటున్న పరిస్థితి. ఇండ్లులేని పేదలందరికీ ఇళ్ల కట్టిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభించిన సంగతి తెలిసిందే. రాష్ట్ర వ్యాప్తంగా ప్రజా పాలనలో స్వీకరించిన దరఖాస్తుల్లో అర్హుల్ని గుర్తించి ఇండ్లు మంజూరు చేసింది. పెరిగిన నిర్మాణ వ్యయం, ఆర్థిక స్థోమతలేని పేదరికంతో చాలా మంది లబ్దిదారులు ఇంటి నిర్మాణం చేపట్టలేకపోతున్నారు. మొదట ఇంటి నిర్మాణంలో పునాది తవ్వకం, బేస్‌మెంట్ నిర్మాణం, మట్టి పనులకు రూ. రెండు లక్షల ఖర్చవుతున్నందున పేద లబ్దిదారులు ముందుకు రావట్లేదు. అప్పులు చేసి ఇంటి నిర్మాణం చేసినా బిల్లులు రాకపోతే వీధిన పడతామంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పేద లబ్దిదారులకు ఇంటి నిర్మాణం కోసం స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) ద్వారా రూ. రెండు లక్షల వరకు రుణాలిస్తామని ప్రభుత్వం చెప్పినా ఆచరణకు నోచట్లేదు. ఎస్‌హెచ్‌జీల్లో సభ్యులు కాని వాళ్లకు రుణాలిచ్చే ఛాన్స్ లేదు. దాంతో చాలా మంది లబ్దిదారులు తాము ఇంటిని కట్టుకోలేకపోతున్నామని, ప్రభుత్వమే ఇంటిని కట్టించాలని కోరుతున్నారు. పైగా 600 చదరపు అడుగుల స్థలంలోనే 45 రోజుల గడువులో ఇంటి నిర్మాణం పూర్తి చేయాలని, లేదంటే రద్దు చేస్తామని ప్రభుత్వం చెప్పడంతో 25 శాతం మంది చేతులెత్తేస్తున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాదిలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో ఇప్పటికే మూడు లక్షల ఇళ్లను మంజూరు చేసి లబ్దిదారులకు ప్రొసీడింగ్స్ అందజేసింది. రాష్ట్రంలో 80.05 లక్షల మంది పేదలు ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేశారు. దరఖాస్తుల్ని పరిశీలించిన ప్రభుత్వం 77.19 లక్షల మందిని యాప్‌లో అప్‌లోడ్ చేసింది. ఉమ్మడి మెదక్ జిల్లాలో 7,53,668 మంది ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేశారు. వీటిని పరిశీలించి ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 3500 ఇండ్ల చొప్పున 40,555 ఇళ్లను మంజూరు చేశారు. సంగారెడ్డి జిల్లాలో 16,555, మెదక్ జిల్లాలో 9000, సిద్దిపేట జిల్లాలో 15,000 ఇండ్లను మంజూరు చేశారు. మిగతా వాళ్లకు దశల వారీగా మంజూరు చేస్తామని ప్రభుత్వం తెలిపింది. లబ్దిదారులకు ఇళ్లను మంజూరు చేసే ప్రక్రియ జరిగినప్పటికీ ఇళ్ల నిర్మాణం మాత్రం ముందుకు సాగట్లేదు. ముందస్తుగా లబ్దిదారులే సొంత డబ్బులతో బేస్‌మెంట్ లెవల్ వరకు నిర్మాణం చేసుకున్న తర్వాతనే ప్రభుత్వం బిల్లు చెల్లిస్తుంది. దాంతో ఆర్థిక స్థోమతలేని పేద లబ్దిదారులు ఇంటి నిర్మాణ పనుల్ని మొదలు పెట్టట్లేదని తెలుస్తోంది. ప్రభుత్వం ఆర్థిక సహకారం అందించాలని లబ్దిదారులు కోరుతున్నారు.

ప్రారంభం కాని 25 శాతం ఇండ్ల నిర్మాణం

ఉమ్మడి మెదక్ జిల్లాలో మంజూరైన ఇందిరమ్మ ఇండ్లలో ఇప్పటి వరకు 25 శాతం వరకు నిర్మాణ పనులు ప్రారంభంకాలేదు. సంగారెడ్డి జిల్లాకు 16,555 ఇళ్లు కేటాయించగా అందులో 14,529 ఇండ్లను మంజూరు చేశారు. వీటిల్లో ఇప్పటి వరకు 6450 ఇండ్లకు మార్కింగ్ చేశారు. 1850 ఇళ్ల వరకు బేస్‌మెంట్ లెవల్లో ఉన్నాయి. 120 ఇండ్ల నిర్మాణం రూఫ్‌లెవల్లో ఉండగా మరో 50 ఇళు స్లాబ్ లెవల్లో ఉన్నాయి. మంజూరైన ఇండ్లల్లో కేవలం 8470 మాత్రమే నిర్మాణ పనులు ప్రారంభమై వివిధ దశల్లో ఉన్నాయి. ఇంకా 5737 ఇళ్ల నిర్మాణ పనులు ఇంత వరకు ప్రారంభించలేదు. అందులో 3791 మంది లబ్దిదారులు ఆర్థిక స్థోమత బాగలేకపోవడంతో ఇళ్ల నిర్మాణానికి ఆసక్తి చూపట్లేదని గృహ నిర్మాణ శాఖ గుర్తించినట్టు అధికారులు చెబుతున్నారు. మంజూరైన లబ్దిదారుల్లో 25 శాతం మంది తమ వద్ద డబ్బుల్లేకపోవడం వల్లే ఇంటి నిర్మాణం చేసుకోలేకపోతున్నామని చెబుతున్నారు.

క్షేత్ర స్థాయిలో 'నవతెలంగాణ' పరిశీలన..

చౌటకూర్ మండల కేంద్ర గ్రామంలో 26 ఇళ్లు మంజూరు కాగా, 18 మంది లబ్దిదారులు మాత్రమే నిర్మాణ పనులు మొదలుపెట్టారు. ఇందులో 11 బేస్‌మెంట్ లెవల్లో ఉండగా ఐదు మాత్రం లెంటల్ లెవల్లో, మరో 2 స్లాబ్ లెవల్లో ఉన్నాయి. మరో ఎనిమిది మంది లబ్దిదారులు పైసల్లేక నిర్మాణ పనులు ప్రారంభించలేదు. ఆ ఎనిమిది మంది లబ్దిదారులు ఇంటిని నిర్మించుకోలేకపోతున్నామన్న విషయాన్ని రాత పూర్వకంగా తెలపాలని అధికారులు చెబుతున్నారు. సదాశివపేట మండలం ఆరూరు గ్రామంలో 50 ఇండ్లు మంజూరయ్యాయి. వీటిల్లో 24 మాత్రమే నిర్మాణ పనులు జరుగుతున్నాయి. 11 ఇళ్ల నిర్మాణ పనులు ఇంత వరకు ప్రారంభించలేదు. మరో 15 మంది లబ్దిదారులు మేం ఇండ్లు కట్టుకోలేకపోతున్నామని పంచాయతీ కార్యదర్శికి చెప్పారు. ఏటిగడ్డసంఘం గ్రామంలో 34 ఇండ్లు మంజూరవ్వగా 7 ఇండ్ల నిర్మాణం కోసం మార్కింగ్ చేయగా ఆరు చోట్ల మాత్రమే పనులు జరుగుతున్నాయి. రెండు ఇళ్లకు బేస్‌మెంట్ లెవల్లో బిల్లులిచ్చారు. మిగతా ఇండ్ల నిర్మాణం మొదలుపెట్టలేదు. పైగా నాలుగు లబ్దిదారులు మాత్రం డబ్బుల్లేనందన ఇంటి నిర్మాణం తమ వల్ల కాదని చెబుతున్నారు. సిద్దిపేట జిల్లాలో 15 వేల ఇండ్లు మంజూరు చేశారు. వీటిల్లోనూ ఆరు వేల ఇళ్ల నిర్మాణం ఇప్పటికీ మొదలుకాలేదు. రాయపోల్ మండలంలోని రామారంలో 183 ఇండ్లు మంజూరవ్వగా 17 మాత్రమే పనులు నడుస్తున్నాయి. 90 మంది లబ్దిదారులు ఇంటి నిర్మాణం చేపట్టలేమని తేల్చి చెప్పారు. మరో 76 మంది లబ్దిదారులు పునాది తవ్వే పనులు కూడా మొదలుపెట్టలేదు. చిన్నకొడూరు మండల కేంద్రంలో 521 ఇండ్లు మంజూరవ్వగా 300 ఇండ్లు మాత్రమే నిర్మాణమవుతున్నాయి. 221 ఇళ్ల నిర్మాణ పనులు ఇప్పటికీ ప్రారంభించలేదు. మెదక్ జిల్లాలోనూ తొమ్మిది వేల ఇళ్లను మంజూరు చేయగా వీటిల్లో 3500 వరకు పనులు మొదలు పెట్టలేదు.

అలవిగాని ఆంక్షలు

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో ప్రభుత్వం అలవిగాని ఆంక్షలు పెట్టింది. 600 చదరపు అడుగుల్లోనే ఇంటిని కట్టుకోవాలని చెప్పడం వల్ల పెద్ద కుటుంబం ఉన్న వాళ్లు ఇష్టపడట్లేదు. 45 రోజుల వ్యవధిలోనే స్లాబ్ పడిపోవాలని, లేదంటే బిల్లులు మంజూరవ్వబోవని చెబుతున్నారు. గ్రామాల్లో మేస్త్రీలు, ఇసుక, మట్టి లభించట్లేదు. సిమెంట్, ఐరన్ ధరలు పెరగడం వల్ల ఇబ్బందులున్నాయి. మరో పక్క ఆగస్టులోపు నిర్మాణ పనుల్ని ప్రారంభించకపోతే ఇంటిని రద్దు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. తక్కువ సమయంలో లక్షలు తెచ్చి ఎట్లా నిర్మాణ పనులు చేపడతామని బైరు జయమ్మ, గొల్ల విజయలక్ష్మితో పాటు బూడిద బూమయ్య, ఎంకపల్లి హైమద్, పెద్దగొల్ల రాములు పేర్కొన్నారు. డ్వాక్రా సంఘం నుంచి ప్రతి లబ్దిదారునికి రూ.2 లక్షల ఇవ్వాలని కోరుతున్నారు.

వ్యవసాయంలో బయోటెక్నాలజీ వినియోగం పెరగాలి

- ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రైస్ రీసెర్చ్ డైరెక్టర్ డా|| ఆర్ఎం సుందరం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వ్యవసాయ రంగంలో బయోటెక్నాలజీ వినియోగాన్ని మరింతగా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రైస్ రీసెర్చ్ డైరెక్టర్ డాక్టర్ ఆర్ఎం.సుందరం అన్నారు. వాతావరణ మార్పులు, తెగుళ్లు, దిగుబడులు వంటి సమస్యలను వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న నేపథ్యంలో హైదరాబాద్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో గురువారం బయోటెక్నాలజీ సాధనాల వినియోగంపై రాష్ట్ర స్థాయి వర్క్‌షాప్ నిర్వహించారు. 'పంటల అభివృద్ధికి బయోటెక్నాలజీ వినియోగం : ముఖ్యమైన పురోగతులు' అనే అంశంపై సదస్సును వ్యవసాయ విశ్వవిద్యాలయం, బయోటెక్ కన్సార్టియం ఆఫ్ ఇండియా లిమిటెడ్ సంయుక్తంగా నిర్వహించాయి. ఫెడరేషన్ ఆఫ్ సీడ్ ఇండస్ట్రీ ఆఫ్ ఇండియా మద్దతు ఇచ్చింది. ఈ సందర్భంగా డాక్టర్ ఆర్ఎం సుందరం మాట్లాడుతూ.. బయోటెక్నాలజీ ఆవిష్కరణలను అర్థం చేసుకోవడానికి, సమర్థవంతంగా ప్రజలకు వివరించడానికి, బాధ్యతగా అమలు చేయడానికి అధికారుల నుంచి పాలసీ మేకర్ల వరకూ సామర్థ్యాన్ని పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. భారత్ కొన్ని దశాబ్దాలుగా వ్యవసాయ ఉత్పాదకతలో పురోగతి సాధించిందన్నారు. అయినా, భవిష్యత్ అవసరాల కోసం భూమి విస్తీర్ణాన్ని పెంచడం కాకుండా, సాంకేతిక పురోగతిపై దృష్టి పెట్టాలని సూచించారు.



బయోసీడ్స్ డివిజన్, డిసిఎం శ్రీరామ్ లిమిటెడ్ డాక్టర్ పరేష్ వర్మ మాట్లాడుతూ.. బయోటెక్నాలజీ అనేది తుది లక్ష్యం కాదన్నారు. కానీ స్థిరమైన వ్యవసాయం దిగుబడులు సాధించడానికి ముఖ్యమైన మార్గమన్నారు. జన్యు మార్పు ద్వారా తక్కువ ఎరువులు, తక్కువ నీటితో అధిక దిగుబడి ఇచ్చే పంటల సాగు సాధ్యమన్నారు. దాంతో రైతులకు తక్కువ ఖర్చు అవుతుందన్నారు. పంటలు వాతావరణ మార్పులు, తెగుళ్లకు తట్టుకునేలా మారతాయని తెలిపారు. రైతులు ఎదుర్కొంటున్న వాతావరణ మార్పులు, తెగుళ్లు, పోషక లోపాల సమస్యలను పరిష్కరించేందుకు.. ఇప్పుడు శాస్త్రవేత్తలకు జన్యు మార్పు, జీనోమ్ ఎడిటింగ్ అనే రెండు శక్తివంతమైన టెక్నాలజీలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు.

బయోటెక్ కన్సార్టియం ఆఫ్ ఇండియా లిమిటెడ్ చీఫ్ జనరల్ మేనేజర్ డాక్టర్ విభా ఆహుజా మాట్లాడుతూ.. శాస్త్రీయ అభివృద్ధిని ప్రజలకు ఉపయోగపడే విధంగా చేయాలంటే రాష్ట్ర ప్రభుత్వాలు, విశ్వవిద్యాలయాలు, రైతు సముదాయాలతో చర్చలు జరపడం అవసరమని చెప్పారు. దేశంలో ప్రభుత్వ, ప్రయివేట్ ప్రయోగశాలల్లో చాలా పరిశోధనలు జరుగుతున్నాయన్నారు. అవన్నీ ప్రజలకు ఉపయోగపడాలంటే సమర్థవంతంగా అమలు చేసే మార్గాలు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిఎఆర్ సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ కాటన్ రీసెర్చ్ మాజీ డైరెక్టర్ డాక్టర్ వైజి.ప్రసాద్, యూనివర్సిటీ ప్రొఫెసర్లు తదితరులు పాల్గొన్నారు.

దేశీయ వినియోగంపై దృష్టి పెట్టాలి

- అల్యూమినియం పరిశ్రమ నిపుణులు
- అప్పుడే టారిఫ్‌లను ఎదుర్కోగలం

హైదరాబాద్ : అమెరికా విధిస్తోన్న సుంకాలను ఎదుర్కోవడానికి దేశీయ వినిమయంపై దృష్టి పెట్టాలని అల్యూమినియం ఎక్స్‌ట్రూషన్ మానుఫాక్చరర్స్ అసోసియేషన్ (అలెమయి) అధ్యక్షుడు జితేంద్ర చోప్రా అన్నారు. ఇతర దేశాల నుంచి చౌకగా జరుగుతున్న దిగుమతులను తగ్గించాలన్నారు. దేశంలో ప్రతీ ఏడాది మూడు మిలియన్ టన్నుల వినియమం జరుగుతుందన్నారు. ఇందులో సగం పైగా ఇతర దేశాల నుంచే వస్తోందన్నారు. అమెరికాలో తలసరి అల్యూమినియం వాడకం 17-18 కిలోలు, చైనాలో 20-24 కిలోలుగా ఉండగా.. భారత్‌లో కేవలం 3-4 కిలోలు మాత్రమే ఉందన్నారు. టారిఫ్‌ల నుంచి తప్పించుకోవడానికి దేశీయంగా వినిమయాన్ని పెంచుకోవడం మంచి మార్గమన్నారు. దేశంలోనే మొట్టమొదటి అల్యూమినియం ఎక్స్‌ట్రూషన్‌కు సంబంధించిన ప్రదర్శన, సందర్శనను సెప్టెంబర్ 10-13 తేదిల్లో న్యూఢిల్లీలో ఏర్పాటు చేస్తున్నామన్నారు.

కాంగ్రెస్ నాయకునిపైకి బాటిల్ విసురుతున్న ఎమ్మెల్యే లక్ష్మి

రేషన్ కార్డుల పంపిణీలో రసాభాస

- కాంగ్రెస్ నాయకునిపైకి బాటిల్ విసిరిన ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కుమురం భీం - ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో గురువారం నిర్వహించిన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం రసాభాసగా మారింది. జిల్లా అదనపు కలెక్టర్ డేవిడ్, ఆర్‌డిఒ లోకేశ్వర్‌రావుతో కలిసి ఎమ్మెల్యే కోవ లక్ష్మి పాల్గొన్నారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న రేషన్‌కార్డుల పంపిణీని ప్రభుత్వం చేపట్టిందని అదనపు కలెక్టర్ డేవిడ్ అన్నారు. ఎమ్మెల్యే కోవ లక్ష్మి మాట్లాడుతూ.. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో చెప్పిన ప్రకారం రేషన్‌కార్డులు పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. తమ ప్రభుత్వ హయాంలో ఎన్నో రకాల అభివృద్ధి పనులు చేసినట్టు వివరించారు. అక్కడే ఉన్న కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యామ్‌నాయక్ కల్పించుకొని ఇది ప్రభుత్వ కార్యక్రమమని, ప్రతిపక్ష కార్యక్రమం కాదని, ఎమ్మెల్యేగా మాట్లాడే విధానం తెలుసుకోవాలని సూచించారు. అధికారులను బెదిరించడం సరైంది కాదనడంతో ఆగ్రహానికి గురైన ఎమ్మెల్యే తన చేతిలోని వాటర్ బాటిల్‌ను ఆయనపైకి విసిరారు. దీంతో ఒక్కసారిగా అక్కడ ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. అదనపు కలెక్టర్ వారిని వారించే ప్రయత్నం చేశారు. పోలీసులు ఇరు గ్రూపులను అక్కడి నుంచి పంపించేశారు. ఎక్కడి నుండో వచ్చిన స్థానికేతరులు నియోజకవర్గంలో అధికారం చెలాయిస్తే ఊరుకునే ప్రసక్తి లేదని ఎమ్మెల్యే కోవ లక్ష్మి హెచ్చరించారు. పది సంవత్సరాలు బిఆర్‌ఎస్‌లో అనేక రకాల పదవులు అనుభవించి ఇప్పుడు తమ పార్టీని విమర్శించడం దారుణమన్నారు. మహిళా ఎమ్మెల్యేను అవమానించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఘటన మొత్తాన్ని కాంగ్రెస్ నాయకత్వం దృష్టికి తీసుకెళ్లడంతోపాటు తమ పార్టీ నాయకునికి కూడా చెబుతామని అన్నారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో రాజకీయాలు మాట్లాడటం సరైంది కాదన్నందుకు తనపై ఎమ్మెల్యే దాడి చేయడం హేయమైన చర్య అని శ్యామ్‌నాయక్ అన్నారు. బీఆర్‌ఎస్ పది సంవత్సరాల్లో ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను చూసి ప్రతిపక్షాలు తట్టుకోలేకపోతున్నాయని విమర్శించారు. ఎమ్మెల్యే తన స్థాయిని మరిచి బాటిల్ విసరడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా విధానం మార్చుకోవాలని హితవు పలికారు.

పురస్కారాలు ప్రోత్సాహంతో కొత్త శక్తినిస్తాయి

ప్రజాశక్తి - కల్చరల్

పురస్కారాలు ప్రోత్సహంతో పాటు కొత్త శక్తి నిస్తాయి అని మల్కాజ్ గిరి కోర్టు న్యాయమూర్తి జస్టిస్ భాషా నవాజ్ ఖాన్ అన్నారు ఆరాధన కల్చరల్ అసోసియేషన్ ప్రముఖ సాంస్కృతిక సంస్థ 31వ వార్షిక వేడుకలు సందర్భంగా వివిధ రంగాలకు చెందిన ప్రముఖులకు ప్రతిభా పురస్కారాలు ప్రదానోత్సవం జరిగింది. నాటక రచయిత ఖాజా వలికి జువ్వాడి రామారావు స్మారక పురస్కారం నృత్య గురువు నిర్మల ప్రభాకర్ వెంకట రెడ్డి పురస్కారం గాయని రాధా రాణికి సంగీత పురస్కారం సాహితీ వేత్త డాక్టర్ రఘుకి చిక్కా రామ దాసు స్మారక పురస్కారం అయోధ్య రెడ్డికి పాత్రికేయ పురస్కారం శివాని రెడ్డి సంజన రెడ్డిలకు నృత్య పురస్కారం ముఖ్య అతిథిగా జస్టిస్ నవాజ్ ఖాన్ బహుకరించి అభినందించారు. న్యాయం ధర్మం నీతి కోసం నిలబడే వారే సమాజానికి అవసరం అన్నారు యువ కళా వాహిని అధ్యక్షుడు లంక లక్ష్మీ నారాయణ అధ్యక్షత వహించగా కళా పోషకులు ఉమర్ ఖాన్ భాస్కర్ గుప్తా వెంకట రావు చలపతి శివ జ్యోతి తదితరులు పాల్గొన్నారు. సంస్థ స్థాపక అధ్యక్షుడు లోకం కష్ణయ్య స్వాగతం పలికారు. తొలుత లలిత రావు డాక్టర్ రావు రాధా రాణి తదితరులు సినీ గీతాలు ఆలపించారు. ఈ వేదిక పై బధిర బాలికలు నర్తించిన అంశాలు ఆకట్టుకున్నాయి.

బిసిలను మోసగించిన కాంగ్రెస్

- రాహుల్ పిఎం అయితేనే బిసి రిజర్వేషన్లకు చట్టబద్ధత అంటారా? : కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిసిల రిజర్వేషన్ల చట్టబద్ధత విషయంలో కాంగ్రెస్ పార్టీ వారిని మోసం చేసిందని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ విమర్శించారు. ఎన్నికలకు ముందు రాష్ట్రంలో అధికారంలోకి వస్తే చేస్తామని చెప్పిన హస్తం పార్టీ ఇప్పుడేమో రాహుల్‌గాంధీ ప్రధానమంత్రి అయ్యాక అని చెబుతున్నదని ఆయన మండిపడ్డారు. సిఎం రేవంత్ రెడ్డికి కెసిఆర్ ఫోబియా పట్టుకుందని, ముఖ్యమంత్రి చేస్తోంది.. ముమ్మాటికి డ్రామానే అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో పరిగి నియోజకవర్గానికి చెందిన నాయకులు బిఆర్‌ఎస్‌లో చేరారు. వారికి కేటీఆర్ స్వాగతం పలికి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌లో రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అయితేనే... అనే షరతు ఉందా? అని ప్రశ్నించారు. ఢిల్లీకి వెళ్లినా రేవంత్ రెడ్డి కేసీఆర్ గురించే మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. కేసీఆర్ పేరు తీయకుండా ఉండలేని మానసిక రుగ్మత రేవంత్ రెడ్డికి ఉన్నదేమో అని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. బీసీ రిజర్వేషన్ల పేరుతో కాలయాపన చేస్తున్న కాంగ్రెస్, బీసీ డిక్లరేషన్‌లోని ఇతర హామీలను పూర్తిగా పక్కన పెట్టిందని ఆరోపించారు. పీఎం మోడీతో, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతోనూ రేవంత్ రెడ్డి చేస్తున్నది డ్రామానేనని కేటీఆర్ అన్నారు. రేవంత్ రెడ్డి కాంగ్రెస్ లో చివరకు వరకు ఉంటానని చెప్పడం కూడా డ్రామానేనని కేటీఆర్ మండిపడ్డారు.

పార్టీ మారిన నేతల దౌర్భాగ్య పరిస్థితి

పార్టీ మారిన ఎమ్మెల్యేలు ఏ పార్టీలో ఉన్నారో చెప్పుకోలేని దౌర్భాగ్య పరిస్థితిలో ఉన్నారని కేటీఆర్ వ్యాఖ్యానించారు. "కండువాలు కప్పుకుని ఇప్పుడు దేవుడి కండువాలు కప్పుకున్నామనీ, ఏ పార్టీలో ఉన్నారో చెప్పుకోలేకపోతున్నారని తెలిపారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలు ఏ పార్టీలో ఉన్నారో రాష్ట్రంలో చిన్న పిల్లవాడిని అడిగినా చెప్తారనీ, కానీ శాసనసభ స్పీకర్‌కు మాత్రం ఇంకా తెలియడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అరాచకాలు తగ్గాలంటే, అధికారులు ప్రజల మాట వినాలంటే రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీని గెలిపించాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలను కాంగ్రెస్ మోసం చేసిందని కేటీఆర్ తీవ్రంగా విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికలు అయిపోగానే కాంగ్రెస్ సర్కారు రైతుబంధును రద్దు చేస్తుందని కేటీఆర్ జోస్యం చెప్పారు.

కార్యకర్తలను అన్ని విధాలుగా ఆదుకుంటాం

గత 10 సంవత్సరాలు అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్ర అభివృద్ధిపై దృష్టి సారించినట్టు కేటీఆర్ తెలిపారు. ఆ సమయంలో పార్టీ కార్యకర్తలకు తగినంత చేయలేకపోయామని ఆయన అంగీకరించారు. మళ్లీ అధికారంలోకి రాగానే అన్ని విధాలుగా కార్యకర్తలను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీని గెలిపించేందుకు గట్టిగా కష్టపడాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. తెలంగాణ ఉన్నంత కాలం గులాబి కండువా ఉంటుందని చెప్పారు. కాంగ్రెస్, బీజేపీలను మట్టి కరిపించి కేసీఆర్‌ను మళ్లీ ముఖ్యమంత్రిగా ఎన్నుకుంటామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

వెంకటేష్ ఆశయ సాధనకు పని చేయాలి

- జాన్‌వెస్లీ, చెరుపల్లి సీతారాములు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వెంకటేష్ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న జాన్‌వెస్లీ

పేద ప్రజల సమస్యలే తన సమస్యలుగా భావించి నిరంతరం ప్రజల కోసం పనిచేసిన రాసాల వెంకటేష్ ఆశయాల సాధన కోసం ప్రతి ఒక్కరూ పనిచేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా బస్వాపురం మాజీ సర్పంచ్ రాసాల నిర్మల భర్త, సిపిఎం మండల కమిటీ సభ్యులు, రైతు సంఘం డివిజన్ కార్యదర్శి రాసాల వెంకటేష్ బుధవారం గుండెపోటుతో మృతి చెందారు. వెంకటేష్ భౌతికకాయాన్ని బుధవారం రాత్రి జాన్‌వెస్లీ సందర్శించి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బస్వాపురాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దిన ఘనత సిపిఎంకే దక్కిందని, గ్రామ అభివృద్ధిలో వెంకటేష్ పాత్ర కీలకమని చెప్పారు. కూలి, రైతు, వ్యవసాయ, మహిళా హక్కుల కోసం జరిగే పోరాటాలలో ముందుండి నడిపించేవారని గుర్తు చేశారు. బస్వాపురం రిజర్వాయర్ సాధనలో, భూములు కోల్పోతున్న ప్రజలకు భూములు ఇప్పించడంలో.. వారి పక్షాన నిలబడి పోరాటాలు చేయడంలో వెంకటేష్ పాత్ర కీలకమని వివరించారు. అదేవిధంగా వెంకటేష్ మృతదేహాన్ని గురువారం మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వెంకటేష్ మరణం సిపిఎం, ప్రజాసంఘాలకు, బసవపురం గ్రామ శాఖకు తీరని లోటన్నారు. వెంకటేష్‌కు నివాళులర్పించిన వారిలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండి అబ్బాస్, జిల్లా కార్యదర్శి ఎండి జహంగీర్, రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నరసింహ, బట్టుపల్లి అనురాధ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాటూరి బాలరాజు, కల్లూరి మల్లేశం దాసరి పాండు, జిల్లా కమిటీ సభ్యులు కోమటిరెడ్డి చంద్రారెడ్డి, దయ్యాల నరసింహ, మాయ కృష్ణ, సిర్పంగి స్వామి, గడ్డం వెంకటేష్, మండల కార్యదర్శి పల్లెర్ల అంజయ్య, నాయకులు ఎదునూరి మల్లేష్, కొండ అశోక్, అన్నంపట్ల కృష్ణ తదితరులు ఉన్నారు.

విద్యార్థి దశ నుండే పత్రికలను చదవటం అలవాటు చేసుకోవాలి

- టిఎస్‌యుటిఎఫ్ సీనియర్ నాయకులు రాజా శ్రీనివాసరావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వాస్తవాలను అక్షర రూపంలో ప్రజలకు చేరవేసే కరదీపిక నవతెలంగాణ దినపత్రిక అని టిఎస్‌యుటిఎఫ్ సీనియర్ నాయకులు రాజా శ్రీనివాసరావు అన్నారు. ప్రజాశక్తిగా ప్రారంభమై రాష్ట్ర విభజన నేపథ్యంలో నవతెలంగాణగా మార్పు వచ్చిందన్నారు. కార్మికుల, కర్షకులతోపాటు ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలపై వాస్తవ కథనాలను రాస్తూ పదో వార్షికోత్సవాన్ని విద్యార్థుల సమక్షంలో జరుపుకోవడం అభినందనీయమని కొనియాడారు. నవతెలంగాణ పదో వార్షికోత్సవం సందర్భంగా గురువారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం పట్టణంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు పాపారావు అధ్యక్షతన నిర్వహించిన సభలో రాజా శ్రీనివాసరావు మాట్లాడారు. విలువలకు కట్టుబడి నిజాన్ని నిర్భయంగా రాయటం నవతెలంగాణకు మాత్రమే సాధ్యమని చెప్పారు. ప్రజా సమస్యలను వెలికితీస్తూ కథనాలు రాయటమే కాకుండా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల సమాచారాన్ని ఎప్పటికప్పుడూ ప్రజలకు చేరవేస్తుందని తెలిపారు. ప్రతి అక్షరం ప్రజల పక్షంగా నిలిచిన నవతెలంగాణ ఇలాంటి వార్షికోత్సవాలు మరెన్నో విజయవంతంగా జరుపుకోవాలని, ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలవాలని ఆకాంక్షించారు.

పత్రికలను చదవడం అలవాటు చేసుకోవాలి : నర్సారెడ్డి

విద్యార్థి దశ నుండే ప్రతికలను చదవడం అలవాటు చేసుకోవాలని నవతెలంగాణ జిల్లా ఇన్‌చార్జి ఎంబి నర్సారెడ్డి సూచించారు. కార్మిక, కర్షక పత్రికైన నవతెలంగాణ పదో వార్షికోత్సవాన్ని విద్యార్థులతో కలిసి జరుపుకోవడం ఆనందంగా ఉందని తెలిపారు. సోషల్ మీడియా శరవేగంగా అభివృద్ధి చెందినప్పటికీ విషయం పట్ల సమగ్ర సమాచారాన్ని అందించేది పత్రికలే అన్నారు. ప్రభుత్వ, ప్రయివేట్ విద్యాసంస్థల్లో నెలకొన్న సమస్యలను వెలికితీయటంలో నవతెలంగాణ చాంపియన్‌గా నిలుస్తుందని, అదేవిధంగా విద్యార్థులకు అనేక రకాల సమాచారాన్ని అందిస్తుందని తెలిపారు. అలాంటి నవతెలంగాణ పత్రికను కార్మికులు, కర్షకులు ఉద్యోగస్తులతో పాటు విద్యార్థులు కూడా చదవాలని సూచించారు. మాజీ వార్డ్ నెంబర్ బండారు శరత్‌బాబు మాట్లాడుతూ.. నవతెలంగాణ నిర్వహించిన డ్రాయింగ్ పోటీలలో చిన్నారులు అద్భుతమైన ప్రతిభను ప్రదర్శించారని, ప్రతి విద్యార్థీ సృజనాత్మకంగా చిత్రాలు గీశారని అన్నారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో నవతెలంగాణ టౌన్ రిపోర్టర్ దారిశెట్టి సతీష్‌బాబు, డివిజన్ ఇన్‌చార్జి సంతోష్ కుమార్, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.